1

నవతెలంగాణ

ఆదిలాబాద్

ఆదివారం | ఆగస్టు 25, 2024 | www.navatelangana.com

సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు

నవతెలంగాణ-కెరమెరి

సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని నోడల్ అధికారి ఆడే ప్రకాష్ అన్నారు. శనివారం మండలంలోని అగర్వాడ ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరుని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మెనూ ప్రకారం వారానికి మూడు రోజులపాటు విద్యార్థులకు కోడిగుడ్డు అందించాలన్నారు. కొన్ని పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని పేర్కొన్నారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు.



అనుమతులు లేకుండా నడిపిస్తున్న పాఠశాల గదులు సీజ్

లక్షెట్టిపేట : అనుమతులు లేనిదే పాఠశాల తరగతి గదులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి కాసుల రవీందర్ తెలిపారు. శనివారం ఉన్నతాధికారుల ఆదేశాలు, కొంతమంది ఫిర్యాదుల మేరకు పట్టణంలో శ్రీ చైతన్య టెక్నో పాఠశాల అనుమతి లేకుండా 8, 9 తరగతులు నడుపుతున్నట్లు సమాచారం మేరకు ఆకస్మికంగా తనిఖీ చేసి ఆ రెండు గదులను సీజ్ చేశారు. అనుమతులు వచ్చే వరకు ఎట్టి పరిస్థితుల్లో తరగతులు నడపరాదని యాజమాన్యాన్ని హెచ్చరించారు. గతంలోనే పలు విద్యార్థి సంఘాలు, కొంతమంది చేసిన ఫిర్యాదుతో పాఠశాలకు వెళ్లి హెచ్చరించామని తెలిపారు. అయినా ఇలాంటి సంఘటన పునరావృతమైందని, పద్ధతి మారలేదని, మరోసారి అనుమతి లేకుండా తరగతి గదులు నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ప్రయివేటుపై నిఘా..!

- ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు
- కనిపించని ధరల పట్టికలు..రికార్డుల నిర్వహణ కరువు
- సీజనల్ వ్యాధుల వేళ..అధిక బిల్లులు వసూలు
- నిబంధనలు విస్మరించిన వాటిపై చర్యలకు సన్నద్ధం

ప్రయివేటు ఆస్పత్రుల నిర్వహణపై జిల్లా అధికార యంత్రాంగం నిఘా పెట్టింది. నిబంధనల మేరకు నడుచుకుంటున్నారా..? విస్మరిస్తున్నారా అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. రెండు, మూడు రోజులుగా వైద్యశాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సిన కొన్ని ప్రయివేటు అస్పత్రులు వాటిని యథేచ్ఛగా కాలరాస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఏయే చికిత్సలకు ఎంత ఫీజు తీసుకుంటారో ధరల పట్టికను ప్రదర్శించాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో అలాంటివేమీ కనిపించడం లేదు. ఆయా ఆస్పత్రులకు వచ్చే రోగుల వివరాలను తప్పనిసరిగా రికార్డులు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ వీటిని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఇటీవల జిల్లా కలెక్టర్ ఓ ప్రయివేటు ఆస్పత్రిని తనిఖీ చేయగా.. వివిధ రకాల లోపాలు బయటపడ్డాటం చర్చనీయాంశంగా మారింది. దీంతో అన్ని ప్రయివేటు ఆస్పత్రుల్లోనూ తనిఖీలు ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వైద్యో నారాయణో హరి అంటారు..వైద్యులు దేవుళ్లతో సమానం అని. కానీ కొంత మంది వైద్యుల తీరు కారణంగా పవిత్రమైన వైద్యవృత్తికి చెడ్డపేరు వస్తోంది. కొంత మంది వైద్యులు తమ దగ్గరికి వచ్చే రోగులకు తక్కువ ఫీజు తీసుకోవడంతో పాటు చికిత్సలు అందించడంలోనూ సేవాభావం ప్రదర్శిస్తుంటే..కొంతమంది మాత్రం అలాంటివేమీ పట్టించుకోవడం లేదు. పైసలే పరమావధి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఏదేని ఒక ప్రయివేటు ఆస్పత్రి నిర్వాహించాలంటే ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా బెడ్ ఛార్జీలు, చికిత్సలు, ఏ టెస్టుకు ఎంత తీసుకోవాలో స్పష్టంగా రాయాల్సి ఉంటుంది. కానీ కొన్ని మినహా.. అనేక ఆస్పత్రుల్లో ఈ బోర్డులు మచ్చుకైనా కనిపించకుండా పోయాయి. ధరల పట్టికలతో పాటు ఏ ఆపరేషన్‌కు ఎంత ఫీజు తీసుకోవాలి. బయోవెస్టేజ్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ తదితర అన్నింటినీ స్పష్టంగా పేర్కొనాల్సి ఉంది. కానీ అనేక ఆస్పత్రులు వీటిని పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదనే ఆరోపణలున్నాయి.

సీజనల్ వేళ..అధిక బిల్లులపై నజర్..!

జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇంటికొకరు చొప్పున మంచం పట్టిన పరిస్థితి కనిపిస్తోంది. పల్లె, పట్టణం తేడా లేకుండా ఇంటిల్లిపాది వివిధ రకాల జ్వరాలతో బాధపడుతున్నారు. సర్కారు ఆస్పత్రుల్లో పడకలు లభించవనే కారణంతో పాటు ప్రయివేటులో వివిధ రకాల సౌకర్యాలు ఉంటాయనే కారణంగా అనేక మంది ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్సలు తీసుకుంటున్నారు. వైరల్, టైఫాయిడ్ తదితర జ్వరాలతో రోజుల తరబడి ఆస్పత్రుల్లో చికిత్సలు తీసుకోవాల్సి వస్తోంది. మరోపక్క కచ్చితంగా వ్యాధి నిర్ధారణ కోసం టెస్టులు చేయించుకోవాల్సి వస్తోంది. దీంతో ఏ టెస్టుకు ఎంత తీసుకుంటారో ఆయా ఆస్పత్రుల్లో పట్టికలు లేకపోవడంతో ల్యాబ్ టెక్నీషియన్లు ఎంత అడిగితే అంత ఇవ్వాల్సి వస్తోంది. ముఖ్యంగా ఆస్పత్రుల్లో జాయిన్ అయితే బెడ్ ఛార్జీలు కూడా అధికంగా ఉంటున్నాయి. రోగి డిశ్చార్జి అయ్యేలోపు మందులు, రోజువారీ రక్త పరీక్షలతో పాటు బెడ్ ఛార్జీలు కలిపి ఒక్కొక్కరు సుమారు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చవుతున్నట్లు తెలుస్తోంది. రోజువారీ కూలీ పనులు చేసుకునే అనేక మంది పేదలు గత్యంతరం లేక త్వరగా నయం కావాలనే ఉద్దేశంతో ప్రయివేటులో చికిత్సలు తీసుకుంటుండగా.. ఇదే అదనుగా కొన్ని ప్రయివేటు ఆస్పత్రులు అందినకాడికి దండుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి.

వివరాలు అందించడంలో నిర్లక్ష్యం..!

డెంగ్యూ జ్వరం నిర్ధారించాలంటే కచ్చితంగా ఎలిసా పరీక్ష చేయించాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ టెస్టు ప్రస్తుతం రిమ్స్‌లో మాత్రమే అందుబాటులో ఉంది. కానీ కొన్ని ప్రయివేటు ఆస్పత్రులు రోగులకు సంబంధించి రక్తనమూనాలను ఎలిసా టెస్టు కోసం పంపించడం లేదని తెలిసింది. డెంగ్యూ కిట్ ద్వారా ప్రాథమికంగా నిర్ధారించి చికిత్సలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో వైద్యఆరోగ్యశాఖకు డెంగ్యూ జ్వరాలపై స్పష్టమైన లెక్కలు లేకుండాపోయినట్లు తెలుస్తోంది. వీటితో పాటు ఆయా జ్వరాలతో వచ్చే వారి వివరాలు కూడా ఎప్పటికప్పుడు అందించాల్సి ఉంటుంది. కానీ ఈ నిబంధనలు ఎవరూ పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఇటీవల జిల్లా కలెక్టర్ నిర్వహించిన తనిఖీల్లోనూ ఓ ప్రయివేటు ఆస్పత్రిలో రికార్డుల నిర్వహణ కనిపించలేదని వెల్లడైంది. ఇలా మరికొన్ని ఆస్పత్రులు సైతం నిబంధనలు విస్మరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రయివేటు ఆస్పత్రుల్లో తనిఖీపై జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కృష్ణను ఫోన్‌లో సంప్రదించగా.. తనిఖీలు నిర్వహిస్తున్నామని సమాధానమిచ్చారు.

పెన్‌గంగలో గుర్తు తెలియని మృతదేహం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలోని పారిగాం గ్రామ శివారు ప్రాంతంలో పెన్‌గంగ నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్సై తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శనివారం పెన్‌గంగా నది ఒడ్డున వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికులు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుడి చేతిపై పాము గుర్తు ఉండి హిందిలో సందీప్ అని రాసి ఉందని ఎస్సై తెలిపారు. ఎవరికైనా వ్యక్తి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

బ్యాంకు ఖాతా నుండి డబ్బులు కాజేసిన దుండగులు

జైపూర్ : భీమారం మండల కేంద్రానికి చెందిన మెండె పున్నకు సంబంధించిన ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాతో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా నుండి గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు కాజేసినట్లు బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. భీమారం ఎస్‌బీఐ బ్యాంకు ఖాతా నుండి రూ.49,700, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా నుండి రూ.13వేలు తనకు ఏమాత్రమూ సమాచారం లేకుండా ఇతర బ్యాంకు ఖాతాల్లోకి ట్రాంజక్షన్ జరిగినట్లు తెలిపారు. ఈ నెల 15న భీమారం ఎస్‌బీఐ బ్యాంకు ఖాతా నుండి రూ.9,700 అదే రోజు రాత్రి సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా నుండి రూ.13 వేలు డెబిట్ అయినట్లు బ్యాంక్ ద్వారా అందిన మెసేజ్ ఆధారంగా గుర్తించినట్లు తెలిపారు. విషయం తెలిసిన మరుసటి రోజు రెండు బ్యాంకు ఖాతాల్లో బ్యాలెన్స్‌లు సరి చూసుకోగా జీరో బ్యాలన్స్ అయినట్లు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒకే రోజు రెండు ఖాతాల ద్వారా రూ.49వేలు ఎస్‌బీఐ ఖాతా నుండి గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు కాజేసినట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలో ఉన్న బ్యాంక్ బ్యాలెన్స్ చెక్ చేసుకోగా రూ.13 వేలు ప్రయివేటు బ్యాంక్‌లోకి ట్రాంజక్షన్ జరిగినట్లు అధికారుల ద్వారా తెలిసిందని తెలిపారు. మోసపూరితంగా డబ్బులు కాజేసిన వ్యక్తులను గుర్తించి న్యాయం చేయాలని కోరుతూ 1930 సైబర్ విభాగానికి ఫిర్యాదు చేశాడు. ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాల నుండి రూ.62,700 డబ్బులు కాజేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

మహిళ ఆత్మహత్యాయత్నం : కాపాడిన పోలీసులు

మంచిర్యాల : పట్టణంలో గల రాళ్లవాగు వంతెనపై ఆత్మహత్యకు యత్నించిన మహిళను మంచిర్యాల బ్లూ కోర్టు సిబ్బంది కాపాడారు. శనివారం పాత మంచిర్యాలకు చెందిన మహిళ కుటుంబ కలహాలతో రాళ్ల వాగు వంతెన పైనుండి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సమయంలో విధుల్లో ఉన్న బ్లూ కోర్టు సిబ్బంది ప్రదీప్, సత్యం, సంపత్ మహిళను రక్షించి మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహిళను కాపాడిన బ్లూ కోర్టు సిబ్బందిని సీఐ అభినందించారు.

పాఠశాలల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్ : శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు పాఠశాలల్లో ముందస్తు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శ్రీ కృష్ణ, గోపికల వేషధారణలతో చిన్నారులు సందడి చేయగా, ఉత్సవాలతో పాఠశాల ప్రాంగణాలు సందడిగా మారాయి. పట్టణంలోని మాస్టర్ మైండ్స్, సంస్కర్, నారాయణ తదితర పాఠశాలలో శనివారం ముందస్తు జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నరులంతా శ్రీ కృష్ణ, గోపికల వేషధారణలో పాఠశాలకు చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చిన్నారులు ఉట్టిని కొట్టారు. గీతాలకు అనుగుణంగా చిన్నారులు నృత్యాలు చేస్తూ, సందడి చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న వారిని చూసి తల్లితండ్రులు మురిసిపోయారు. దీంతో ఆయా పాఠశాల ప్రాంగణంలో కోలాహల వాతావరణం నెలకొంది. పండగల విశిష్టతను చిన్నారులకు తెలియజేయాలన్న ఉద్యేశంతో వేడుకలను వైభవంగా జరిపామని పేర్కొన్నారు. ఇందులో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నిర్మల్ : జిల్లా కేంద్రంలోని వశిష్ట ఇంపల్స్ ఈ టెక్నో పాఠశాలలో ముందస్తుగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో 'ఉట్టి కొట్టి' చూపరులను ఆకర్షింపజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్ గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ విద్యార్థులను అభినందిస్తూ, పోషకులకు కృష్ణాష్టమి విశిష్టతను తెలియపరిచి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్ గొల్లపల్లి మాధవి, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ దేవదాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖానాపూర్ : పట్టణంలోని ఆయా ప్రయివేటు పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వేరువేరుగా ఘనంగా నిర్వహించారు. శనివారం కృష్ణవేణి పాఠశాల, విశ్వశాంతి గురుకుల పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చిన్నారులచే వివిధ కృష్ణుని వేషాదరణలు ధరించి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులు పర్యవేక్షించి, విద్యార్థులకు మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్ గాండ్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రమేష్ సిబ్బంది, విశ్వశాంతి పాఠశాల డైరెక్టర్ గడపాలే సునీత, సుభాష్, పాఠశాల ప్రిన్సిపాల్ సుమతీదేవి, పాఠశాల కరస్పాండెంట్ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓను కలిసిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు



ఉట్నూర్ : ఐటీడీఏ కార్యాలయంలో పీఓ ఖుష్బూ గుప్తాను శనివారం కేబీ ప్రాంగణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్ సింగ్, అధ్యాపకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పీఓను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించానని, ప్రస్తుతం కళాశాలలో 18వందలకుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ఇందులో గిరిజన విద్యార్థులు అధికంగా ఉన్నారని పీఓ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి సంవత్సరం ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు కొంత మందికి టాస్క్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. అనంతరం పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటుగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధి, ఉద్యోగ రంగాలలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. ఈ నెలలోనే ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థుల కోసం ఉపాధి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, గిరిజన విద్యార్థులను ఉపాధి కల్పన కొరకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఓను కలిసిన వారిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సాయిప్రసాద్, అధ్యాపకులు నర్సింగ్‌రావు, రాణి, రవీందర్, రాజశేఖర్, ముజీబ్, శ్రీనివాస్, జావిద్, పీడీ అనిత, సీనియర్ అసిస్టెంట్ పెంటన్న ఉన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలకు ఉపకరణాలు అందించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలు అందించేలా విలీన విద్య కోఆర్డినేటర్లు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో అల్లింకో వారిచే నిర్వహించబడ్డ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల ఉపకరణాల గుర్తింపు శిబిరానికి అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారికి తగిన ఉపకరణాలు అందించడానికి జిల్లాలోని ఐఆర్టీలు కృషి చేయాలని సూచించారు. పిల్లలకు ప్రభుత్వం ద్వారా అందించే సదుపాయాలను వారికి అందే విధంగా చూడాలన్నారు. పిల్లల తల్లిదండ్రులను పిల్లలను బడిలో చేర్పించి విద్యను అందించే విధంగా చూడాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల బలాలు గుర్తించి వారికి తగిన విద్య ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వారికి అందించడానికి ఈ అసెస్మెంట్ క్యాంపు ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా విద్యాధికారి అశోక్ మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం భవిత కేంద్రాలు ఐఆర్టీలచే నిర్వహిస్తున్నామని, ప్రతిరోజు ప్రత్యేక అవసరాలు గల పిల్లలు బడికి హాజరై విద్య అభ్యసిస్తున్నారన్నారు. వారికి తగిన ఉపకరణాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్, ప్రత్యేక అవసరాలు పిల్లల తల్లిదండ్రులు, ఐఆర్టీలు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో పూర్తి సౌకర్యాలు కల్పించాలి

జిల్లాలోని అంగన్వాడీలలో చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్-2 అంగన్వాడీ కేంద్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, పిల్లల సంక్షేమం కోసం పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడంతో పాటు సకాలంలో పోషక ఆహారాన్ని అందించాలని తెలిపారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గర్భిణులకు పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఒ భాస్కర్ పాల్గొన్నారు.

గుడుంబా తయారీ మానుకోవాలి : సీఐ మోహన్

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ పరిధిలో గుడుంబా తయారి పూర్తిగా నిషేధమని శ్రీరాంపూర్ సీఐ మోహన్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమంలో భాగంగా శనివారం భూర్గుపల్లి గ్రామంలో స్థానిక ఎస్సై రాములతో కలిసి గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలకు భద్రత భావం కల్పించడం కోసం శాఖ పరంగా చేపడుతున్న కమ్యూనిటీ కాంట్రాక్టు కార్యక్రమం ద్వారా శ్రీరాంపూర్ సర్కిల్ పరిధి నలుగురు ఎస్సైలు 35 మంది కానిస్టేబుళ్ల స్పెషల్ పార్టీ, ఎక్సైజ్ సిబ్బందితో గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. గ్రామీణులతో నేరుగా కాంట్రాక్టు ఉండటం ద్వారా గ్రామంలో కొత్త వ్యక్తులు తిరుగాడితే గుర్తించేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. నేరరహిత గ్రామాలుగా తీర్చిదిద్దడం కోసం కమ్యూనిటీ కాంట్రాక్టు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పోలీసులు ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ భద్రత కల్పిస్తారని పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని తెలిపారు. నేరాలు పరిష్కరించడంలో ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. పోలీసుల సాయం అవసరమైనప్పుడు 100 నెంబర్‌కు డయల్ చేయాలని తెలిపారు. గ్రామంలో చేపట్టిన తనిఖీల్లో నగావత్ కమల, భుక్య మారుతి, ధరవాత్ రాజ్యనాయక్, పాల్తె బుజ్జి ఇండ్లలో గుడుంబా తయారీ చేస్తూ పట్టుబడ్డట్లు తెలిపారు. అదేవిధంగా వారిండ్ల నుండి గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం పాకం 200 లీటర్లు, 10 కేజీల బెల్లం, 16 లీటర్ల గుడుంబా లభించినట్లు తెలిపారు. అదేవిధంగా సరైన ధ్రువపత్రాలు లేని 34 మోటార్ సైకిళ్ల, 2 ఆటోలు సీజ్ చేశామని పేర్కొన్నారు. గుడుంబా తయారీ పూర్తిగా మానివేయాలని, లేదంటే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.




ఎస్పీఎంలో ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభం

- కార్మికసంఘాలకు డీసీఎల్ నుండి లేఖలు
- వచ్చే నెల మూడులోగా రికార్డులు సమర్పించాలని ఆదేశాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు కార్మికశాఖ కసరత్తు ప్రారంభించింది. దీనికి సంబంధించి శనివారం ఆదిలాబాద్ డీసీఎల్ (డిప్యుటీ కమిషనర్ ఆఫ్ లేబర్) సునీత మిల్లులోని అన్ని కార్మికసంఘాలకు లేఖలు పంపించారు. 2014లో మిల్లు మూతపడే నాటికి 15 కార్మికసంఘాలు ఉండగా, ఆ సంఘాల నాయకులకు శనివారం లేఖలు అందాయి. 2013 నుండి 2024 వరకు కార్మిక సంఘాలకు సంబంధించిన అన్ని రికార్డులు వచ్చే నెల మూడో తేదీలోగా సమర్పించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. కార్మిక సంఘాలకు సంబంధించి ప్రతీ ఏటా సభ్యత్వ వివరాలు, తీసుకున్న సభ్యత్వ రుసుము, బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటేటా నిర్వహించిన జనరల్ బాడీ సమావేశాల వివరాలను డీసీఎల్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఈ వివరాలు సమర్పించిన కార్మిక సంఘాలతోనే డీసీఎల్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.



11 ఏళ్ల తర్వాత ప్రక్రియ ప్రారంభం

సిర్పూరు పేపర్ మిల్లులో 11 ఏళ్ల తర్వాత గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. చివరిసారిగా 2013 డిసెంబర్ 11న మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల కాలపరిమితి 2015తో ముగిసింది. కాని 2014లోనే మిల్లు మూసివేశారు. 2018 ఆగస్టు రెండో తేదీన మిల్లు పునఃప్రారంభమైనా ఇప్పటి వరకు గుర్తింపు సంఘం ఎన్నికలు జరగలేదు. మిల్లు ప్రారంభమై ఆరేళ్లు కావస్తున్నా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించకపోవడం పట్ల కార్మిక సంఘాలు, రాజకీయపార్టీలు ఆందోళన చేపడుతున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్‌బాబును కలిసి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కార్మికశాఖ కమిషనర్ శ్రీకృష్ణ ఆదిత్యను కలిసి తెలంగాణ సిర్పూరు పేపర్ మిల్లు ఎంప్లాయిస్ యూనియన్ వినతిపత్రం అందించింది. అంతేకాకుండా బీఎస్పీ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కూడా లేబర్ కమిషనర్, జాయింట్ కమిషనర్‌లకు వినతిపత్రాలు అందించారు. ఎట్టకేలకు మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాలు ఉండడం పట్ల కార్మికులలో హర్షం వ్యక్తమవుతోంది.

తక్కువ బరువుతో గ్యాస్.. వినియోగదారుల ఆందోళన



దస్తురాబాద్ : హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ తూకంలో జరుగుతున్న అవకవతకలను శుక్రవారం దస్తురాబాద్ గ్రామ ప్రజలు గుర్తించారు. ఎప్పటిలాగానే శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల వాహనం వచ్చింది. సిలిండర్ తీసుకున్న వినియోగదారులు సిలిండర్ బరువు తక్కువ ఉందని గుర్తించి అక్కడే తూకం వేశారు. తూకం తక్కువ రావడంతో మరిన్ని సిలిండర్లను తూకం వేశారు. 14 కేజీల సిలిండర్‌కు సుమారు 4 కిలోలు తక్కువ బరువు రావడంతో వినియోగదారులు ఆందోళనకు దిగారు. ఇలా ఎన్ని సంవత్సరాల నుంచి జరుగుతుందోనని ఆందోళనకు దిగి, వినియోగదారులను మోసం చేస్తున్న యాజమన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఘటన స్థలానికి చేరుకొని, సిలిండర్ తూకం తక్కువ రావడాన్ని ఎస్సై పరిశీలించారు. హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతర ఎస్సైకి, తహసీల్దార్ కార్యాలయంలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ప్రజలను మోసం చేస్తున్న హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ యాజమన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా శనివారం తూనికల కొలతల జిల్లా ఇన్‌చార్జీ అధికారి భూలక్ష్మి స్థానిక పోలీస్ స్టేషన్‌లో గ్రామస్తుల ఆధ్వర్యంలో తూకం వేయగా, 40 సిలిండర్లలో మూడు కిలోల బరువు తక్కువ రావడంతో, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

బోథ్: పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సాయినగర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్‌కు చెందిన ఆనందుల రవితేజ(24) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు ఇటీవల మెడికల్ షాప్ పెట్టాడు. అలాగే 5 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని, వ్యవసాయం చేస్తున్నాడు. రూ.5లక్షలు అప్పు కావడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. శనివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అయనను బోథ్ సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి నుంచి నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

చేతక్ ఎలక్ట్రిక్ స్కూటీని ప్రారంభించిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్ : పట్టణంలోని బజాజ్ షోరూంలో చేతక్ ఎలక్ట్రికల్ స్కూటీని శనివారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో కాలుష్యం విపరీతంగా పెరుగుంతుందనీ, అన్ని వాహనాల కంపెనీలు ఎలక్ట్రిక్ వాహనాల తయారీకే మొగ్గు చూపుతున్నాయన్నారు. కార్యక్రమంలో షోరూం ప్రొప్రయిటర్ మలిశెట్టి మధుకర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల టెండర్ రద్దు చేయాలి

కాగజ్‌నగర్ : ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల టెండర్‌ల నిర్వహణలో పలు అక్రమాలు జరిగినందున ఆ టెండర్‌ను రద్దు చేయాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ పొన్న రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఎలాంటి పత్రికా ప్రకటనలు ఇవ్వకుండా ప్రస్తుత అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు పలు శాఖలలో ఉద్యోగాల భర్తీ చేపడుతున్నాయని, ప్రస్తుతం మళ్లీ ఆ ఏజెన్సీలకే నియామక బాధ్యతలు అప్పచెప్పే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీల గుర్తింపు కోసం నిర్వహించిన టెండర్‌లలో పలు అక్రమాలు జరిగినట్లు అనుమానాలున్నాయని ఈ టెండర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు జేఏసీ నాయకులు ముజామిలుద్దీన్ హైమద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండా శ్యాం ఉన్నారు.

యువకుల రక్తదానం

జైపూర్ : మండలంలోని రామారావుపేట్ గ్రామానికి చెందిన దుర్గం మధునయ్య మొదటి వర్ధంతి సందర్భంగా రక్తదానం చేసినట్లు గ్రామానికి చెందిన యువకులు దుర్గం శ్యామ్, రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా రక్త దానం చేయడంతో పాటు 50 మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు. రక్తదానం చేసిన వారిలో జంగిలి శ్రావణ్, నేదునూరి కుమార్, నవీన్, చిరంజీవి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | 25 ఆగస్టు, 2024 | www.navatelangana.com

స్వర్ణ ప్రాజెక్టు గేటు ఎత్తివేత

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు ఎగువ భాగాన కురుస్తున్న వర్షానికి 2వేల క్యూసెక్కుల వరదనీరు



వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు సామర్థ్యం 1183 అడుగులకు గాను 1183 అడుగులకు చేరుకోవడంతో నీటి పారుదలశాఖ అధికారులు శనివారం ఉదయం ఒక గేటు ఎత్తి 2080 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నదీ పరివాహక ప్రాంతం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని చాత గ్రామానికి చెందిన అనిల్ పటేల్ తండ్రి సిందే విఠల్ పటేల్ మాజీ సర్పంచ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం ముధోల్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ ఇన్‌చార్జీ నారాయణరావు పటేల్ బాధిత కుటుంబానికి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులకు అడిగితెలుసుకున్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటానని వారికి భరోసా కల్పించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, ఓంప్రకాష్ లడ్డా, రామచందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్, వివేకానంద, గ్రామస్తులు ఉన్నారు.



నీరు నిల్వలేకుండా చూడాలి

- జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి శ్రీనివాస్

నవతెలంగాణ-బేల

మండలంలోని జునోని గ్రామంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల వైద్యాధికారి శ్రీనివాస్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులతో కలిసి శనివారం గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిపించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్‌తో గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పాటు గ్రామంలో ప్రధాన వీధుల గుండా తిరుగుతూ పారిశుధ్యంపై వైద్యులు గ్రామస్తులకు అవగాహన కలిపించారు. కుండలు, కూలర్లు ఇతర ప్రదేశాల్లో నీరు నిల్వ ఉంటే వాటిని తొలగించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు మీ ఇండ్లలో వాడే కుండీలలోని నిల్వ నీటిని గురించి, వివరించారాని వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాధి నిరోధక టీకాల వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇండ్లలోని పరిశుభ్రతను ఆయన స్వయంగా పరిశీలిస్తూ, రెండు రోజులకొకసారి నీటిని మార్చాలని, ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకూడదని, కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇండ్ల పరిసరాల్లో ఉంచకుండా చూడాలని వారికి సూచించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామంలో ఉన్న మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని, కాలువలో నీరు నిల్వలు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వంశీ కృష్ణతో పాటు వైద్య బృందం పాల్గొన్నారు.

కళాకారుడిని సన్మానించిన మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ప్రముఖ కళాకారుడు మిట్టు రవిని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ ఆయన నివాసంలో శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఉమ్మడి జిల్లా నుంచి తెలంగాణ కళా రత్న అవార్డుకి ఆదిలాబాద్ నుంచి రవి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయి కళాకారుడిగా మిట్టు రవి రాణించాలని కోరారు. ఇలాంటి అవార్డులు మరిన్ని పొందుతూ జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కళా రంగంలో జానపద, శాస్త్రీయ నృత్యంలో సేవలందిస్తూ, కళను కళాకారులను ప్రోత్సహిస్తున్న కళాకారులను తయారు చేస్తూ, కళా రంగంలో రాణించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పండ్ల శ్రీనివాస్, ధమ్మా పాల్, కొండ గణేష్, సంజయ్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ డిపో మేనేజర్‌గా నిర్మల్ డీఎం



నవతెలంగాణ-నిర్మల్

హైదరాబాద్ ఆర్టీసీ కళాభవన్‌లో శనివారం ప్రగతి చక్ర అవార్డుల ప్రధానోత్సవంలో నిర్మల్ డిపోమేనేజర్ ప్రతిమారెడ్డికి రాష్ట్ర మొదటి ఉత్తమ డిపో మేనేజర్‌గా అవార్డు దక్కింది. ఈ అవార్డు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్, వైస్ చైర్మెన్ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. నిర్మల్ డిపో ఉద్యోగులతో సన్నితంగా ఉంటూ, ప్రతి సర్వీసును తన కనుసన్నల్లోనే పర్యవేక్షించారని తెలిపారు. ఉద్యోగుల్లో ఉత్సాహం నింపుతూ ప్రతి రోజు గేట్ మీటింగ్‌లు నిర్వహించి, ఆదాయం రావడానికి కారణాలు వెతికారు. కొత్త రూట్‌లలో సర్వీసులను తిప్పితూ ప్రయాణికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా అను నిత్యం సంస్థ అభివృద్ధికి పాటుపడ్డారని పేర్కొన్నారు. నిర్మల్ డిపోను రాష్ట్రంలోనే నెంబర్ వన్ డిపోగా తీర్చి దిద్దాలనే సంకల్పంతో అహర్నిశలు శ్రమించారు. దినదినం సర్వీసు ఆక్యుపెన్సి రేషియో పెంచుతూ, డిపో ఆదాయాన్ని ఏకంగా రూ.28లక్షల నుంచి సుమారు రూ.40 లక్షలకు పెంచి డిపోని లాబాల బాట పట్టించినందులకు డిపోమేనేజర్ ప్రతిమారెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. తమ డిపోమేనేజర్‌కు ఈ గౌరవం దక్కడం ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని నిర్మల్ డిపో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న ఎన్నికలలో బీజేపీ గెలుపు లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సభ్యత నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మనమందరం చాలా అదృష్టవంతులమని ఓ గొప్ప రాజకీయ పార్టీలో పని చేసే అవకాశం వచ్చిందన్నారు. ఇందుకోసం పార్టీ ఇచ్చిన సభ్యత నమోదు కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరిని భాగ్యస్వామ్యులు చేయాలన్నారు. నిరంతరం దేశాభివృద్ధి కొరకు పనిచేస్తున్న నరేంద్ర మోడీనీ వారి ఆలోచన విధానాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పూర్తి సమయం ఇచ్చి సభ్యత నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఎండల లక్ష్మీనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం, విజయ్, వేణుగోపాల్, మయూర్ చంద్ర, ఆకుల ప్రవీణ్, బాబారావు పటేల్, రాజు, సుభాష్ పాల్గొన్నారు.

సమసమాజ స్థాపన కమ్యూనిస్టుల లక్ష్యం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు
- సామాజిక, వర్గ పోరాటాలు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమసమాజ స్థాపన కమ్యూనిస్టుల లక్ష్యమని, కుల నిర్మూలన కులవివక్షకు వ్యతిరేకంగా జమిలిగా సామాజిక, వర్గ పోరాటాలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. శనివారం సీపీఐ(ఎం) పట్టణ కార్యకర్తలకు పార్టీ రాజకీయ శిక్షణ తరగతులను స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు ఆర్.మంజుల అధ్యక్షత వహించారు. కులం, మతోన్మాదం-వర్గదృక్పథం పాఠాన్ని మల్లేష్ బోధించారు. పార్టీ కార్యక్రమం-నిర్మాణం పాఠాన్ని పార్టీ సీనియర్ నాయకులు లంక రాఘవులు బోధించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ కులం, మతం ఆధారంగా దేశంలో రాజకీయాలు నడవడం వాళ్ల సమాజం ముందుకు పోదన్నారు. దేశాభివృద్ధికి ఈ విధానాలు దోహదం చేయవన్నారు. బ్రిటిష్ వారి విభజించు పాలించు విధానాన్ని వంటపట్టించుకున్న పాలకులు ఐక్యంగా ఉన్న ప్రజలను కులం, మతం ఆధారంగా విడదీస్తూ పాలిస్తున్నారని మండిపడ్డారు. మతోన్మాదం సమాజానికి ఎంత నష్టమో ఇటీవల బంగ్లాదేశ్ పరిణామాలు తెలియజేస్తున్నాయని అన్నారు. దేశానికి లౌకిక భారత రాజ్యాంగమే రక్ష అన్నారు. కుల నిర్మూలన కోసం అంబేద్కర్ చేసిన కృషిని వివరించారు. కుల నిర్మూలన జరగాలన్న, మతోన్మాదం ప్రమాదం నుండి దేశాన్ని కాపాడాలన్న సమసామాజ స్థాపన జరగాలన్నారు. రెండురకాల భారతదేశం ఏర్పడిందని ఒకటి కూడినది కాగా మరొక్కటి ధనవంతులతో కూడినది అన్నారు. అంబానీ కొడుకు పెండ్లికి ఐదువేల కోట్లు ఖర్చు చేస్తే మరో పక్కా ఐదు రూపాయల మందుబిళ్ల దొరకక ప్రాణాలు విడుస్తున్న వారు ఎందరో ఉన్నారన్నారు. ఆకలి సూచీలో దేశం 111వ స్థానంలో ఉంటే మరో పక్క ప్రపంచ కుబేరుల్లో అదానీ రెండో స్థానంలో కొనసాగుతున్నారన్నారు. నేటి పాలకులు పేదలను కొట్టి పెద్దలకు దోషి పెడుతున్నారని మండిపడ్డారు. ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా ఇటు సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా సామాజిక, వర్గపోరాటాలను జమిలిగా ముందుకు తీసుకెళ్లాలని అప్పుడే దోపిడీ లేని, కుల అంతరాలు లేని సమాజాన్ని స్థాపించవచ్చు అన్నారు. ఈ లక్ష్యం కోసం జరిగే పోరాటంలో సీపీఐ(ఎం) పార్టీ సభ్యులు ముందుండి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్ సురేందర్, పట్టణ నాయకులు అగ్గిమల్ల స్వామి, లింగాల చిన్నన్న, పి.పొచ్చన్న, లంక జమున, కోవే శకుంతల, పొచ్చక్క, పోసాని, ఆర్.ప్రవీణ్, ప్రభుదాస్, ఆరిఫా, కె.ఆశన్న, ఎస్.స్వామి పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చూడాలి



నవతెలంగాణ-నార్నూర్

వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య పనులను లోపించకుండా చూడాలని పారిశుధ్య కార్మికులకు ఎంపీఓ స్వప్నశీల సూచించారు. శనివారం మండల కేంద్రంలో పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబుతో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించారు. వార్డుల్లో, మార్కెట్‌లో తిరుగుతూ చికెన్ సెంటర్‌ను పరిశీలించి, చెత్త చెదారం తొలగించారు. వ్యాపారులకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెత్తాచెదారం రోడ్డు మీద వేయద్దన్నారు. పారిశుధ్య లోపం వల్ల వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షపు నీరు నిల్వ ఉన్న చోట దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయించారు. అదేవిధంగా పాఠశాలలో సానిటేషన్ చేయించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపడుతున్నామన్నారు.

ప్రధానోపాధ్యాయునికి ఘన సన్మానం



నవతెలంగాణ-ఖానాపూర్

ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ అబ్దుల్ గఫార్ ఇటీవల లక్షెట్టిపేట్ ఆశ్రమ పాఠశాల నుంచి బదిలీపై ఖానాపూర్ ఆశ్రమ పాఠశాలకు వచ్చి విధులు నిర్వహిస్తున్న సందర్భంగా శనివారం కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మెన్ బాణావత్ గోవింద్ నాయక్ ఆయనను ఘనంగా సన్మానించారు. ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది ఉత్తములుగా తయారు చేసిన తమ గురువు నేర్పిన విద్యతో ఇంతటి వారమయ్యామని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెందూర్ మాధవ్ పటేల్, సీతారాం, మల్లేష్, అనిల్ పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా విద్యార్థులకు పౌష్టికాహారం

- బాలికల వసతి గృహాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సన్న బియ్యం అందిస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం కనిపించడం లేదని, విద్యార్థులకు పౌష్టికాహారం అందని ద్రాక్షగా మారుతోందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ, బాలికల వసతి గృహాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగానే మెస్ చార్జ్‌లను పెంచాలన్నారు. వసతిగృహాల సమస్యలపై ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందని గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా సిబ్బంది ఎప్పటికపుడు కృషి చేయాలనీ సూచించారు. ఇదిలా ఉండగా బంగారిగూడలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో వీధి కుక్కల స్టెరిలైజేషన్ ప్రక్రియను ఎమ్మెల్యే పాయల శంకర్ పరిశీలించారు. పట్టణంలో కుక్కల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న నివారణ చర్యల పట్ల పుర సిబ్బందిని అభినందించారు. వీధి కుక్కలా బెడదను నివారించేందుకు తీసుకుంటున్న చర్యలను పుర అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. పట్టణంలో దాదాపు 1200 వరకు వీధి కుక్కలు ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. పట్టణంలో వీధి కుక్కల వల్ల ఇబ్బందులు ఉంటే నేరుగా మున్సిపల్ అధికారులను సంప్రదించాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



నవతెలంగాణ-నిర్మల్

వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి నిర్మల్ పట్టణం భాగ్యనగర్‌లోని వార్డు నెం.33 రాధాకృష్ణ మందిరం వీధిలో మురుగు నీటి నాళాల్లో చెత్త చెదరం చేరి వర్షపు నీరు, మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ శనివారం ఉదయం సమస్య గల ప్రాంతాల్లో పర్యటించి, మురుగు నీటి నాళాలను పరిశీలించి, పారిశుధ్య సిబ్బందితో నాళాల్లో అడ్డుగా ఏర్పడిన వాటిని తొలగింపజేశారు. నాళాల వెంబడి గుబురుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. చైర్మెన్ వెంట జవాన్, పారిశుధ్య సిబ్బంది, కాలనీవాసులు ఉన్నారు.

మత్తు పదార్థాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

- పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ
- పీఓడబ్ల్యూ జిల్లా ఏడో మహాసభలు



నవతెలంగాణ-ఖానాపూర్

మత్తు పదార్థాలను అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ అన్నారు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన ఏడో మహాసభకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ మహాసభకు ముందుగా పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిత జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాసభలో మహిళా అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళల పట్ల వివక్షత కొనసాగుతుందని, పనిచేసే చోట్ల లైంగిక వేధింపులకు గురవుతున్నారని అన్నారు. రోజు రోజుకు మహిళలపై అత్యాచారాలు, వరకట్న హత్యలు, వేధింపులు పెరిగిపోయాయని అన్నారు. ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో మత్తు పదార్థాలను అరికడితే అత్యాచారాలు జరగవని అన్నారు. ఈ మత్తు పదార్థాల వల్ల యువత చెడు మార్గంలో వెళుందని అన్నారు. ఉపాధి లేకపోవడం వల్ల యువతకు మత్తు పానీయాలకు బానిసలు అవుతున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చాక మహిళలపై హింస మతోన్మాదం పెరిగిపోతుందని మహిళ మల్లయోధులపై బీజేపీ ఎంపీ బ్రిడ్జిభూషణ్ వేధింపులకు పాల్పడ్డారని, లైంగిక వేధింపుల చట్టం ఉన్నప్పటికీ అతనిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని అన్నారు. చట్టం అమలు కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ మహాసభకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు, పీఓడబ్ల్యూ జిల్లా నాయకులు మల్లక్క, లావణ్య, చంద్రకళ, రాజేశ్వరి, విజయలక్ష్మి, అనసూయ, అడెల్లబాయి, లక్ష్మి, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సునారికారి రాజేష్, గోపి నర్సయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం లింగన్న పాల్గొన్నారు.

వర్షాలు కురువాలని గ్రామస్తుల పూజలు



నవతెలంగాణ-లోకేశ్వరం

వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, తమ కుటుంబాలను చల్లంగా చూడాలని కోరుతూ శనివారం మండలంలోని రాజుర గ్రామంలోని గోవింద చెరువులో హనుమాన్ విగ్రహం వద్ద సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేసిన వరద పాయసాన్ని చెరువులో కలిపారు. ప్రతి ఏటా వీడీసీ ఆధ్వర్యంలో చెరువులో సత్యనారాయణ వ్రతాన్ని చేయడం ఆనవాయితీగా వస్తుంది. అనంతరం గ్రామస్తులకు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పూజారి దేవిదాస్, వీడీసీ చైర్మెన్ దాసరి ప్రవీణ్, వైస్ చైర్మెన్ నందగిరి బాలరాజుగౌడ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను పున: పరిశీలించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఎస్సీ వర్గీకరణను పున: పరిశీలించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డివిజన్ ప్రధాన కార్యదర్శి తౌటి ఆశన్న అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు వర్గీకరణ చేయడం వల్ల మాలలు, ఉపకులాలు విద్య ఉద్యోగ, ఆర్థిక పరంగా నష్టపోతారని అన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలు దొరకక రోడ్డున పడతున్నారని అన్నారు. వర్గీకరణ చేయడం వల్ల దళితుల ఐక్యత దెబ్బతింటుందని అన్నారు. వర్గీకరణకు రాజకీయ పార్టీలు లబ్ధి కోసమే వత్తాసు పలుకుతున్నాయని అన్నారు. దళితులకు రిజర్వేషన్ శాతం పెంచాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేవలం మాదిగ నాయకులని పిలిపించుకొని రిజర్వేషన్ అమలు చేస్తామని పేర్కొనడం సమంజసం కాదని అన్నారు. మాలల ఉపకులాలను పిలిపించుకొని తమ అభిప్రాయం తెలుసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో మాలలు, ఉపకులాలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి గత ఎన్నికల్లో ఓటు వేయడం జరిగిందని అన్నారు. సుప్రీంకోర్టు మిగతా కులాల అభిప్రాయం తెలుసుకోకుండా, వారి జీవన విధానం తెలుసుకోకుండా వర్గీకరణ అమలు చేయాలని తీర్పు ఇవ్వడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు సుప్రీంకోర్టు మాలలు, ఉపకులాల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఎస్సీ వర్గీకరణ పున: పరిశీలించాలని అన్నారు. అదేవిధంగా ఈనెల 21న భారత్‌బంద్ పిలుపుమేరకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణ నిలుపుదల చేసేంతవరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు బోనకంటి సుభాష్, నాయకులు దామెర కనకారావు, వెలుమల మధు, వెంకటి, నీరటి రవి, రాజకుమార్, వెంకటేష్, సంజీవ్, గంగన్నలు పాల్గొన్నారు.



కేజీబీవీలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తు స్వీకరణ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జామ్ కేజీబీవీలో బోధనేతర సిబ్బంది నియామకానికి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఎంఈఓ మధుసూధన్ ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ కుక్ బీసీ(డీ) జనరల్, అటెండర్ బీసీ(బి), మహిళలు అర్హులు, ఆసక్తి కలిగినవారు ఈ నెల31 తేదీలోపు సారంగాపూర్ మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు వారి బయోడేటాతో పాటు గెజిటెడ్ అధికారి అటెస్టేషన్ పత్రాలు సమర్పించాలని సూచించారు.

సరండి గ్రామంలో వైద్యశిబిరం

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని సరండి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న ఇద్దరు విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేసినట్టు ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. గ్రామస్తులు వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, డయేరియా వంటి వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు చేతులు, కాళ్లు పరిశుభ్రంగా ఉంచుకొనే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. గర్భిణీలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేసుకుంటే తల్లీ, బిడ్డా క్షేమంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కృష్ణకుమార్, ఆశావర్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు సరైన వైద్యం అందించాలి

నవతెలంగాణ-దహెగాం



మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలని మండల ప్రత్యేక అధికారి సజీవన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలను, లోటుపాట్లను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలన్నారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఎంపీడీఓ రాజేందర్‌తో పాటు పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులు పకడ్బందీగా వినియోగించాలి

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్
- దిశా కమిటీ సమీక్షా సమావేశం



దిశ మిటింగ్‌లో ఎంపీని సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, పక్కన ఎమ్మెల్యే హరీష్ బాబు, అదనపు కలెక్టర్ దీపక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు. శనివారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) జిల్లా స్థాయి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. త్రైమాసిక కాలంలో జిల్లాలో జరిగిన సంక్షేమ అభివృద్ధి పథకాలపై మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించడంతో పాటు వ్యాధుల వ్యాప్తిపై సర్వే నిర్వహించడంతో పాటు నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లాలో 803 మంది ఆశ కార్యకర్తలకు గాను 736 మంది పని చేస్తున్నారని, 67 ఖాళీలు, 22 స్టాఫ్ నర్సుల ఖాళీలను వెంటనే భర్తీ చేసే విధంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 314 చౌక ధరల దుకాణాల ద్వారా ఆహార భద్రత కార్డుదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రధానమంత్రి ఉజ్వల పథకం ద్వారా 31 వేల దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకం క్రింద 127 ఆవాసాలలో 1,570 గృహాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం జరిగిందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. మన ఊరు మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సడక్ యోజన క్రింద బీటీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైందని తెలిపారు. శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 973 అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు పంపిణీ చేస్తూ 11 అంగన్‌వాడీ కేంద్రాలను హేతుబద్ధీకరించడం జరిగిందని, పీవీటీజీ గ్రామాలలో 29 అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణం, 251 అంగన్‌వాడీ కేంద్రాలలో తాగునీరు, మూత్రశాలల నిర్మాణం, పెయింటింగ్ పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 25 వేల మంది రైతుల వద్ద నుండి 17 జిన్నింగ్ మిల్లులలో 13.65 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశామని, మారుమూల ప్రాంతాలలో 56 భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఎయిర్ టవర్లు మంజూరు కాగా 10 టవర్ల నిర్మాణానికి అటవీ అనుమతులు రావాల్సి ఉందన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా చేతి వృత్తుల వారికి రుణాల మంజూరుకు 2వేల 48 దరఖాస్తులు రాగా 567 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరుకు సిఫారసు చేయడం జరిగిందని, మిగతా దరఖాస్తులు పరిశీలన దశలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 41.5 కిలోమీటర్ల మేర నాలుగు వరసల జాతీయ రహదారి ఉందని, రహదారిపై గుంతలు ఏర్పడ్డాయని, వెంటనే పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారికి ప్రక్కన ఉన్న గ్రామాలలో రహదారి ప్రక్కన మురుగు కాలువలు నిర్మించాలని సూచించారు. రూ. కోటి 45 లక్షల కంపా నిధులతో కందకాలు తవ్వించి జాసద మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వ నిధులతో రహదారి పనులు, అటవీ శాఖ అనుమతులు, ప్రధానమంత్రి జన్‌మన్ పథకం క్రింద పీవీటీసీలకు గృహాలు నిర్మించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి మంజూరు చేసిన నిధులతో జిల్లాలో పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి నిధులు పూర్తి స్థాయిలో వినియోగించేల చూడాలన్నారు. అంతకు ముందు ఎంపీని కలెక్టర్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్, డీఈఓ అశోక్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌పై బురదజల్లె ప్రయత్నం



నవతెలంగాణ-రెబ్బెన

రెబ్బెన సహకార సంఘం పాలక వర్గంపై ప్రతిపక్ష బీజేపీ నాయకులు రైతు వేదిక వద్ద చేసిన అసత్యపు ఆరోపణలను చేస్తూ బురదజల్లె ప్రయత్నం చేస్తుందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోలేటి గ్రామానికి చెందిన బీజేపీ మహిళ నాయకురాలు కనీస అవగాహన లేక సహకార సంఘం పాలకవర్గంపై లేని పోని విమర్శలు చేస్తూ బురద చల్లె ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఒకపక్క రైతుల కోసం ధర్నా చేస్తున్నామని చెప్పుతూనే స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరలో ఉన్నందున సొంత లబ్ది కోసం అమాయక రైతులను వాడుకుంటున్నారని ఆరోపించారు. సహకార సంఘంలో అవినీతి జరిగినట్టు విచారణలో తేలితే చట్టపరంగా చర్యలకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీలు, సర్పంచ్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని బ్లూమింగ్ బడ్ పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణుడు, గోపిక వేషధారణలతో చిన్నారులు చూపరులను ఆకట్టుకున్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విద్యార్థుల కేరింతల నడుమ ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. గోపికల వేషధారణలతో హాజరైన విద్యార్థుల మధ్య కృష్ణాష్టమి వేడుకలను పాఠశాల సిబ్బంది కోలహాలంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది మునీర్, అజయ్, జ్యోతి, శివాని, ప్రేమలత, సరిత, సుప్రియ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : కృష్ణాష్టమిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో ముందస్తుగా శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుని గోపికల వేషాలతో అలరించారు. వేషధారులతో కలిసి జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల : ముందస్తుగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్యాం మోడల్ పాఠశాలలో హెచ్ఎం తిరుపతి చారి ఆధ్వర్యంలో చిన్నారులు చిన్ని కృష్ణుని వేషాదారణ ధరించి ఉట్టి కొట్టె కార్యక్రమంలో పాల్గొని చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓసీ మేనేజర్‌ను కలిసిన ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-రెబ్బెన

ఖైర్‌గూడ ఓపెన్ కాస్ట్(ఓసీ)కు మేనేజర్‌గా బాధ్యలు స్వీకరించిన జె.శంకర్‌ని ఏఐటీయూసీ ఖైర్‌గూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు జె.రాజేష్ డి. దివాకర్, శేషు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మైన్స్, సేఫ్టీ కమిటీ సభ్యులు దిలీప్, తాళ్లపల్లి కుమారస్వామి, మోడం సత్యనారాయణ, కె.తిరుపతి, రిలే సీ షిఫ్ట్ ఇన్‌చార్జి పుట్టా అంజయ్య జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జి రామ్ కిషన్, నాయకులు షకీల్, రమేష్, రవీందర్ పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాల కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంటర్మీడియట్ పూర్తైన గిరిజన యువతీయువకుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్త ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31లోపు ఆన్‌లైన్ విధానంలో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఓయూఆన్‌లైన్.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 9010295910, 9666748105 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సాహితి వేత్త, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తెలంగాణ రాష్ట్ర పోరాటంలో యువతకు స్ఫూర్తిదాయకుడు దశరథి రంగాచార్యను నేటి విద్యావేత్తలు, యువకులకు ఆదర్శప్రాయుడని మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకుడు అజ్మీరా రామ్ నాయక్ అన్నారు. శనివారం దాశరథి రంగాచార్య జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో రెండు రోజులు నుండి జ్వరంతో బాధపడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతిని పరామర్శించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో దాశరథి రంగాచార్యులు కీలకపాత్ర పోషించారన్నారు. నాటి పోరాటంలో విద్యార్థులకు, కవులకు, కళాకారులకు, విద్యావేత్తలకు మార్గదర్శకుడై మేల్కొల్పిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముఖిద్, అమీర్ ఉన్నారు.



లోక్ అదాలత్‌కు అధిక కేసులు వచ్చేలా చూడాలి

- జిల్లా న్యాయమూర్తి ఎంవీ.రమేష్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జీ ఎంవీ.రమేష్ అన్నారు. ఈ నెల 28న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థాన భవన సముదాయంలో సీనియర్ సివిల్ జడ్జీ యువరాజుతో కలిసి న్యాయవాదులు, పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 28న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో రాజీ మార్గం ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి కక్షిదారులకు అవగాహన కల్పించాలని, కేసులను రాజీకి వచ్చే విధంగా చేయడం ద్వారా కక్షిదారులు సమయం, డబ్బులు ఆదా చేసుకోవచ్చని తెలియజేయాలని, సంబంధిత స్టేషన్ల వారీగా కేసులపై ప్రత్యేక దృష్టికి సారించాలని తెలిపారు. సైబర్ క్రైమ్ కేసులు అధిక సంఖ్యలో రాజీ చేయడంతో పాటు అందించిన వారి సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని, కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాజ మార్గమని అన్నారు. కేసులలో రాజీ కుదుర్చుకోవడానికి ఇష్టపడి అందుబాటులో లేనివారు ఫోన్‌లలో కూడా రాజీ కోసం సంప్రదించవచ్చని దీని కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. స్టేషన్ల వారీగా కేసులను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం బ్రహ్మకుమారీలు జడ్జీలకు రక్షాబంధన్‌ను పురస్కరించుకోని రాఖీలు కట్టారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డిఎస్పీలు సదయ్య, కరుణాకర్, సీఐలు చిట్టిబాబు, సతీష్, అడ్వకేట్లు రాజీవ్ రెడ్డి, సురేష్, నరహరి, జీవీఎస్ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

28న ఐకేపీ వీఓఏల చలో కలెక్టరేట్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 28న ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఐకేపీ వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు బుద్దు అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000 పెంచాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింప చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీఓఏల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వీఓఏలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వినోద్, గణేష్, సుధీర్, అర్చన, కవిత, సరిత, శంకర్, ప్రమోద్, ప్రకాష్, వినోద్, ధర్మరాజు, మహేష్, రమేష్, శ్రీధర్, భీంరావ్ పాల్గొన్నారు.

ఏజెన్సీ భూములు ఆక్రమిస్తే ఆందోళన తప్పదు

- తుడుం దెబ్బ జిల్లా కన్వీనర్ కోవ విజయ్ కుమార్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న తుడుం దెబ్బ నాయకులు

నవతెలంగాణ-కెరమెరి

కెరమెరి శివారులోని 94/1/2 ఏజెన్సీ ప్రాంత ప్రభుత్వ భూమిలో కొందరు గిరిజనేతర నాయకులు, ఎస్టీలుగా చలామణి అవుతున్న లంబాడాలు అమాయక ఆదివాసీ నాయకులతో అక్రమ వెంచర్ ప్లాటింగ్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని తడుం దెబ్బ జిల్లా కన్వీనర్ కోవ విజయ్‌కుమార్ ఆరోపించారు. శనివారం ఏజెన్సీ భూములు అన్యాక్రం కాకుండా కాపాడాలని కోరుతూ తహసీల్దార్‌కు విద్యార్థి సంఘం, రాయి సెంటర్, మండల నాయకులతో కలిసి ఆయన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో కొందరు నాయకులు అక్రమంగా వెంచర్ తీసి ప్లాట్లు తీయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతమైన ఆ భూమిని అన్యాక్రాంతం చేయడానికి యత్నాలు సాగిస్తున్నారన్నారు. భూమిని అన్యాక్రాంతం కాకుండా చూడాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మడవి భరత్ భూషణ్, రాయి సెంటర్ సార్‌మేడి కుమురం అంబారావు, తుడుం దెబ్బ సీనియర్ నాయకులు కనక ప్రభాకర్, కుర్సెంగ దందు, కుమురం లాల్ శావ్, ఆత్రం రాము పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ఆయా పాఠశాల్లో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) సభ్యత్వ నమోదును నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి హాజరై సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికత ఆధారంగా పోరాడి సాధించి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకువచ్చిన 317 జీఓ ద్వారా వేలాదిగా ఉపాధ్యాయులు తమ స్థానికతను కోల్పోయి కుటుంబాలకు దూరంగా ఉంటూ మానసిక ఆందోళనకు గురి అవుతున్నారన్నారు. ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరిని వారి స్థానిక జిల్లాలకు పంపించాలని డిమాండ్ చేశారు. బకాయి పడిన కరువు బత్యం వెంటనే మంజూరు చేయాలని, పీఆర్‌సీ నివేదికను తెప్పించుకుని జాప్యం లేకుండా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహిపాల్, మండల అధ్యక్షులు వైద్య వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి మహేందర్, మండల బాధ్యులు గంగాధర్, రజిని పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంపుకు సైన్స్ ల్యాబ్ ప్రయోగాలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



మొబైల్ సైన్స్ ల్యాబ్ గురించి తెలుసుకుంటున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులలో సృజనాత్మకతను పెంచడానికి మొబైల్ సైన్స్ ల్యాబ్‌లోని ప్రయోగాలు ఉపయోగాత్మకంగా ఉన్నాయని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థుల సౌకర్యార్థం సంస్థ డైరెక్టర్ విక్రమ్ మొబైల్ సైన్స్ ప్రయోగశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచడానికి, శాస్త్రీయ వైఖరిని కల్పించడానికి ఈ మొబైల్ సైన్స్ ల్యాబ్ ఉపయోగపడుతుందని తెలిపారు. మొబైల్ సైన్స్ ల్యాబ్‌ని వినియోగించుకోవడానికి సరైన ప్రణాళిక తయారు చేసుకోవాలని, విద్యార్థులకు ప్రయోగాల ద్వారా వివరిస్తే సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. భారతీయ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ డైరెక్టర్ మాట్లాడుతూ మొబైల్ సైన్స్ ల్యాబ్ విద్యార్థుల్లో సైన్స్ ప్రయోగాలపై అవగాహన పెంచుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సైన్స్ గురించి మరింత తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో మొబైల్ ప్రయోగ ల్యాబ్‌ను అందించడం జరిగిందని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా పిల్లలకు మంచిగా నేర్పిస్తూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ అశోక్, జిల్లా సైన్స్ అధికారి కటుకము మధుకర్, భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, రామ్ కుమార్, డీఆర్‌డీఏ డైరెక్టర్ రామకృష్ణ, పాఠశాల హెచ్ఎం సుభాష్, మహమ్మద్ సాబీర్, మామిడాల తిరుపతయ్య, శాంతి కుమార్, ప్రవీణ్, దుర్గ, మోహన్, లక్ష్మీ ప్రసన్న, భారతీయ భారతీయ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులు శ్రీనివాస్, అమిత్ బండారి, అశోక్ సింగాల్ పాల్గొన్నారు.



మొబైల్ సైన్స్ ల్యాబ్‌తో కలెక్టర్, అధికారులు

ప్రత్యేక నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్నూరు కాపుల అభివృద్ధి చెందాలంటే కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మిట్ట వెంకన్న డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్‌తో రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య పిలుపు నేపథ్యంలో సంఘ భవనంలో మౌన దీక్ష చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపులు ఆర్థికంగా, విద్యా పరంగా ఉన్నత స్థితికి రావాలంటే కార్పొరేషన్‌కి ప్రతి సంవత్సరం రూ.3వేల కోట్లు మంజూరు చేయాలని, జిల్లాల్లో సంఘ భవన నిర్మాణానికి 2 ఎకరాల భూమిని, బాలబాలికలకు హాస్టల్ భవనాల నిర్మాణం కోసం రూ.20 కోట్లు మంజూరు చేయాలన్నారు. జనాభా ప్రాతిపదికన ప్రకారం 5 కార్పొరేషన్, 2 మంత్రి పదవులు, స్థానిక ఎన్నికలల్లో ప్రాదాన్యత ఇవ్వాలన్నారు. మున్నూరు కాపులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గడ్డల సురేష్, మనిగొండ వెంకటేశ్, గాజుల జక్కయ్య, మిట్ట తిరుపతి, గడ్డల శంకర్, మరిషెట్టి రమేష్, రుకుం ప్రహ్లాద్, మిట్ట పోషన్న, బూసి భీమేశ్, పెద్దపల్లి శ్రీను, చిలుకూరి తిరుపతి పాల్గొన్నారు.

ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రాములు బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-జన్నారం



జన్నారం ఐటీఐ కళాశాల నూతన ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా బండి రాములు శనివారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వరరావు ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. అదే కళాశాలలో విధులు నిర్వహిస్తున్న బండి రాములు ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు స్కిల్ ఇండియాలో భాగంగా నాణ్యమైన విద్యను అందించడమే తన లక్ష్యమని ఆయన అన్నారు. బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్‌ను కళాశాల అధ్యాపకులు శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం శంకర్, ఫిరోజ్ ఖాన్, నరసింహ చారి, మమత, సుధారాణి, నజీర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం చేసిన మాజీ జడ్పీటీసీ

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని ఇంధన్‌పల్లి నాయక్‌గూడా గ్రామంలో మూతి ఎల్లవ్వ అనే మహిళ అడవిలోకి కట్టెలకు వెళ్లి కాలుజారి కిందపడి నడుము విరిగింది. మూతి ఎల్లవ్వ రెక్కాడితేకాని డొక్కాడని పరిస్థితిలో కాలం వెల్లదీస్తోంది. ఆమె ఆపరేషన్కు రూ.1,50,000 ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న జన్నారం మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ ఆమెకు రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కమలాకర్, మూతి మల్లేష్, రాజు, మిట్టల భూమేష్, శ్రీనివాస్, వంగపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జన్నారం

సైబర్ నేరాల విషయంలో ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ-2 సత్తార్, ఏఎస్ఐ సురేశ్ సూచించారు. శనివారం పట్టణంలోని ధర్మారం చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు, యువకులకు సైబర్ నేరాలు, రోడ్డు నియమాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

పొలంలో వరి నాట్లు వేసిన కిష్టాపూర్ విద్యార్థులు

నవతెలంగాణ-జన్నారం

ఒకేషనల్ వృత్తి విద్యలో భాగంగా కిష్టాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు శనివారం గ్రామ సమీపంలోని పొలాల్లో వరి నాట్లు వేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రైతులను వరి పంట పండించడం, నాట్లు వేయడం దిగుబడి సాధించడం, వారి కష్ట సుఖాలను అనేక విషయాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజన్న, అధ్యాపకుడు అశోక్ పాల్గొన్నారు.

కార్మికులకు నిర్దిష్టమైన హామీలు ఇవ్వాలి

నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్ర ముఖ్యమంత్రి సోమవారం సింగరేణి బొగ్గు గనుల పర్యటకు వస్తున్న సందర్భంగా కార్మికులకు నిర్దిష్టమైన హామీలు ఇవ్వాలని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు భాగస్వాములైన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ యూనియన్లు ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రితో లాభాల్లో వాటాను కార్మికులకు వెంటనే చెల్లించేలా ప్రకటన చేయించాలన్నారు. సొంతింటి పథకం అమలుకు యాజమాన్యానికి ఆదేశాలు ఇప్పించాలని, సింగరేణి ఆర్థిక పరిపుష్టికి రూ.29 వేల కోట్ల ప్రభుత్వ బకాయిలు వెంటనే చెల్లించేలా కార్మికుల సమక్షంలో ప్రకటించాలన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



నవతెలంగాణ-తాండూర్

మండలానికి విశేష సేవలు అందించి ఇటీవల సాధారణ బదిలీపై మందమర్రి మండలానికి వెళ్లిన వ్యవసాయ అధికారి కిరణ్మయిని శనివారం మండలంలోని అధికారులు, నాయకులు, విలేకరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి అధికారికి బదిలీలు సర్వసాధారణమని బదిలీ అయిన ప్రాంత ప్రజలతో మమేకమై ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఉద్యోగి తమ ఉద్యోగ బాధ్యతలను సమర్థవత్తంగా నిర్వర్తించుకొంటూ ప్రతి స్థానాచల్నాన్ని ఎదుగుదలకు ఉపయోగించుకోని ఉద్యోగంలో వురోగతి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్, ఏఈఓలు ధనలక్ష్మి, శంకర్, పుష్ప, సీనియర్ నాయకులు దత్తాత్రేయ రావు, సింగల్ విండో డైరెక్టర్ దత్తుమూర్తి, చంద్రశేఖరర్ పాత్రికేయులు ఎనగంటి కస్తూరి శ్రీహరి, సిద్ధిక్, రాజేశం, శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు

నవతెలంగాణ-నస్పూర్

చదువుతూనే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని, ప్రభుత్వం తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం-హైదరాబాద్ ద్వారా దూర విద్యా విధానంలో ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ (ఓపెన్ స్కూల్) కోర్సు 2024-25 అందించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియత పద్ధతిలో ఆర్థిక, సామాజిక కారణాలతో చదువు కొనసాగించలేక మధ్యలో మానివేసిన వారికి, ఉపాధి కోసం పనిచేస్తూ తీరిక వేయడంలో చదువుకోవాలనుకునే వారికి, అట్టడుగు వర్గాల మహిళలకు, చిన్న ఉద్యోగస్తులకు నాణ్యమైన అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం ఓపెన్ స్కూల్ ద్వారా కోర్సులను అందిస్తుందని తెలిపారు. 14 సంవత్సరాల వయసు నుండి వివిధ కారణాలతో 10వ తరగతి విద్యకు దూరమైన, మధ్యలో బడి మానివేసిన వారు, 10వ తరగతిలో అనుత్తీర్ణులైన వారు, 15 సంవత్సరాల వయసు నుండి వివిధ కారణాలతో జూనియర్ కళాశాల విద్యకు దూరమైన వారు, 10వ తరగతిలో ఉత్తీర్ణులైన యువతి యువకులు ఓపెన్ స్కూల్ ద్వారా అడ్మిషన్ పొంది చదువుకోవచ్చని తెలిపారు. ఈ క్రమంలో అక్టోబర్ 3వ తేదీ వరకు ఆన్ లైన్‌లో 'తెలంగాణఓపెన్‌స్కూల్.ఓఆర్జీ' వెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకుని అడ్మిషన్ పొందాలని తెలిపారు. విద్యాభ్యాసం రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కు అని, జ్ఞానం, జీవన నైపుణ్యాలను అందించే విద్య అందరికీ ఉపయోగపడుతుందని అన్నారు. ఇంటి బాధ్యతలు, ఉద్యోగాలకు ఏమాత్రం ఆటంకం కలగకుండా సెలవు దినాలలో మాత్రమే ముఖాముఖి తరగతులు అధ్యయన కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని, అందరికీ అందుబాటులో విద్య అనే నినాదాన్ని అనుసరించి అభ్యాసకులకు పూర్తి స్వేచ్ఛను, కోర్సులు ఎంపికలు వెసులు బాటను కల్పిస్తూ విద్యను అందించడంలో తనదైన పాత్ర పోషిస్తూందని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని సంతకాల సేకరణ

నవతెలంగాణ-నస్పూర్



కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు అన్ని గనులలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకులు కస్తూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ సింగరేణి ఎన్నికల్లో గెలిచిన గుర్తింపు సంఘం ఇప్పటివరకు కూడా గుర్తింపు పత్రం తీసుకోకపోవడం వల్ల గనులలో అనేక అపరిష్కృత దీర్ఘకాలిక సమస్యలు మరుగున పడుతున్నాయని అన్నారు. ఎన్నికలలో కార్మికులకు ఇచ్చిన సొంతింటి కల, ఐటీ మాఫీ, పేర్ల మార్పిడి ఇప్పటివరకు పరిష్కారం కాలేదని మండిపడ్డారు. అలాగే సింగరేణి సంస్థకు లాభాలు ఎంత వచ్చిందో ప్రకటించకపోవడం సరికాదని అన్నారు. వాస్తవ లాభాలు ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణికి రావలసిన రూ.30 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఆగస్టు 26వ తేదీన అన్ని గనుల మేనేజర్లకు వినతి పత్రాలు అందజేస్తామని, అలాగే 28వ తేదీన జీఎం కార్యాలయం ఎదట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కెన్యూటెక్ ఫిట్ నాయకులు పెరిక సదానందం, సందీప్, రమేష్, ప్రతాప్, పుల్లారావు రాజగోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటు చేయాలని వరి నాట్లు వేస్తూ నిరసన



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని మాకులపేట పంచాయతీ పరిధిలో గల కోయపోషగూడ గిరిజన గుడానికి వెళ్లే దారి పూర్తిగా బురదమయం కావడంతో శనివారం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి గుడానికి చెందిన గిరిజనులతో కలిసి బురదలో నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరాలు మారిన ప్రభుత్వాలు మారిన గిరిజనుల తలరాతలు మారడం లేదని దశాబ్దాలు గడుస్తున్న కోయపోషగూడానికి రోడ్డు సౌకర్యం కల్పించడంలో స్థానిక నాయకులు విఫలమవుతున్నారని విమర్శించారు. ఆదివాసుల జీవితాల్లో మార్పు రావడం లేదనడానికి నిదర్శనం ఈ రోడ్డేనని అన్నారు. గూడానికి చంద్ర గిరిజనులు నిత్యవసర పనులకు అత్యవసర పరిస్థితులు ఉన్న ప్రధాన రహదారికి రావాల్సిందేనని చిన్న వర్షం పడిన రోడ్డు పూర్తిగా బురదమయంగా మారుతుందని నడవడానికి కూడా కష్టంగా ఉంటుందని అన్నారు. అదే రోడ్డు వెంబడి వ్యవసాయ భూములకు వెళ్లే ట్రాక్టర్లు నడవడం వల్ల రోడ్డు పూర్తిగా చెడిపోయిందని అన్నారు. రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి కోయపోషగూడానికి పక్కా రహదారని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు కనికరపు అశోక్ రజక సంఘం జిల్లా నాయకులు పయురాల రాములు, కోయపోషగూడెంకి చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

నవతెలంగాణ-తాండూర్



గంజాయి, డ్రగ్స్ అలవాట్లకు దూరంగా ఉంటూ విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సూచించారు. శనివారం చంటి బెల్లంపల్లి-2 టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్టీ మేరీస్ హై స్కూల్‌లో గంజాయి, మాదక ద్రవ్యాల వాడకం, వాటి వల్ల కలిగే నష్టాలపై సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అబ్జలోద్దీన్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఏసీబీ మాట్లాడారు. గంజాయి మాదక ద్రవ్యాలకు, సిగరెట్, గుట్కా, ఆల్కహాల్ వంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా ఉండాలని వాటికి ఆకర్షితులు అయి జీవితాలు నాశనం చేసు కొనవద్దని చెప్పారు. బెల్లంపల్లి పట్టణంలో ఎవరైనా గంజాయి అమ్మినా, పీల్చిన తమ దృష్టికి తేవాలని, గంజాయి మహమ్మారి నిర్మూలనలో అందరు తమ వంతుగా కృషిచేయాలని కోరారు. విద్యార్థిని, విద్యార్థులు భారత ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అని విద్యార్థులు అందరూ స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. విద్యార్థినీ, విద్యార్థులు వారు చదు వుకుంటున్న కాలేజీ కి, ఇంటికి మంచి పేరు తీసుకు వచ్చే పనులు చేయాలని అవగాహన కల్పించినారు. ఇటీవల యాంటీ డ్రగ్స్ అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలి



నవతెలంగాణ-నస్పూర్

వర్షాకాలంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో వసతి గృహాల నిర్వహణపై సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 17 ప్రీ మెట్రిక్, 8 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వసతి గృహాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని, జ్వరాల బారిన పడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి ప్రత్యేక భోజనం అందించి ప్రత్యేక గదిలో ఉంచి ఎప్పటికప్పుడు సరైన వైద్య సేవలు, మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకొని వసతి గృహాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, కాచి చల్లార్చి వడపోసిన శుద్ధమైన తాగునీటిని అందించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలని, ఉన్నతాధికారులు ఆకస్మికంగా సందర్శించినప్పుడు ఖచ్చితంగా అందుబాటులో ఉండాలని తెలిపారు. వసతి గహ సంక్షేమాధికారులు స్థానికంగా అందుబాటులో ఉండాలని, స్థానికతను పాటించని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం రవీందర్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో స్టడీ మెటీరియల్ అందజేత

నవతెలంగాణ-మంచిర్యాల



జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో శనివారం ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు డాక్టర్ బీవీఎస్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు బీఎస్ రావు మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు లైబ్రరీలను సద్విని యోగం చేసుకోవాలన్నారు. పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగ సాధనకు పోటీ పడుతున్నారని, సరి పడా స్టడీ మెటీరియల్ లేక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రం మొత్తంలో చాలా వరకు ఉద్యోగాలు ఖాళీ గా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు విద్య, వైద్యానికి మౌలిక వసతులు కల్పిస్తూ ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్‌లు జగన్, లచ్చన్న, మంచిర్యాల ఐఎంఎ అధ్యక్షుడు పూజారి రమణ, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని కొండాపూర్‌కు చెందిన అల్లాటి అజయ్, గంధం చరణ్



మేదర్ పేటకు చెందిన ఉస్మాన్ ఖాన్, కాసిపేటకు చెందిన ఆవుల విమల వివిధ కారణాలతో మరణించగా వారి కుటుంబ సభ్యులకు కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్ ద్వారా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఒక్కో కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. జిల్లా నాయకులు గడ్డం త్రిమూర్తి స్థానిక నాయకులతో కలిసి వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ప్రజా సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్నారని తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తూ బాసటగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొంగల నవీన్, మాజీ ఉపసర్పంచ్ రమేష్, కాంగ్రెస్ నాయకులు లక్కాకుల సృజన్, ఇప్ప రవీందర్, చొప్పదండి రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు సిరికొండ నవీన్, ఇప్ప భూమన్న, పెంట శ్రవణ్, మల్లేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా సైన్స్ అధికారి మధుబాబు



నవతెలంగాణ-హాజీపూర్

గుడిపేటలోని మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను జిజ్ఞాస సంచార వాహనం సందర్శించింది. దీనిలో భాగంగా శనివారం జిల్లా సైన్సు అధికారి ఎస్ మధుబాబు విద్యార్థుల్లోని విజ్ఞాన తృష్ణను తీర్చుకోవాలని, అందుకోసం ప్రయోగ నైపుణ్యాలను పెంపొందిచుకోవాలన్నారు. పరిశీలనా దృష్టి పెంచుకొని సమస్యలకు పరిష్కారం చూపే నూతన మార్గాలను అన్వేషించాలని తెలియజేశారు. కొన్ని వినూత్న ప్రయోగాలతో విద్యార్థులను ప్రేరేపితం చేశారు. మన చుట్టూ ఉన్న అనేక సమస్యలకు పరిష్కారాలను చూపే నూతన ఆవిష్కర్తలుగా విద్యార్థులు ఎదగాలని సూచించారు. విద్యార్థులు కనిపెట్టే నూతన ఆవిష్కరణలకు ఇన్స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్ వంటి అనేక కార్యక్రమాలు చక్కటి అవకాశాలను కల్పిస్తున్నాయని, వాటిలో విద్యార్థులు తప్పక పాల్గొని వారి ఆవిష్కరణలకు రూపకల్పన చేసి అనేక సమస్యలకు పరిష్కారం చూపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ (ప్రిన్సిపాల్) సేరు శ్రీధర్, జిజ్ఞాస సంచార వాహనం ఇన్స్‌పెక్టర్ సాయి, సంపత్ పాల్గొన్నారు.

పొన్కల్ జీపీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీపీఓ

నవతెలంగాణ-జన్నారం

పోనకల్ గ్రామపంచాయతీని జిల్లా పంచాయతీ అధికరి వెంకటేశ్వరరావు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామపంచాయతీలోని శానిటేషన్, డ్రై వెస్ట్ రికార్డ్‌లను, ఓటర్ మెర్జింగ్ పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న గిరిజన ఆశ్రమ వసతీగృహంలో వంట గది, డార్మెట్రీ, పారిశుధ్యాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న విద్యార్థులకు ప్లాస్టిక్, సీజనల్ వ్యాధులు, పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ ఎంపీఓ జలందర్, జిల్లా ట్రైబల్ అధికారి పంచాయతీ కార్యదర్శి రాహుల్, బిల్ కలెక్టర్ అనిల్ జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-లక్షెట్టిపేట


గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మతి చెందినట్లు ఎస్ఐ పి సతీష్ తెలిపారు. లక్షెట్టిపేట మండలం కొత్తూరు గ్రామ శివారులో వెంకటేశ్వర బ్రిక్స్ ముందు జాతీయ రహదారిపై అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని దండేపల్లికి చెందిన అల్వాల కోటయ్య(55) మృతిచెందాడు. మృతుడు శుక్రవారం జెండవెంకటాపూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి దండేపల్లికి నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై చనిపోయాడు. మృతునికి పెళ్లి కాలేదు. మతుని అన్న అల్వాల రాజన్న పిర్యాదు మేరకు లక్షెట్టిపేట ఎస్ఐ-2 రామయ్య కేసు నమోదు చేశారని తెలిపారు.

ఓటరు జాబితా కోసం ఇంటింటి సర్వే నిర్వహించాలి

నవతెలంగాణ-తాండూర్

జరగబోయే పంచాయితీ ఎన్నికల కోసం తప్పులు లేని ఓటర్ల జాబితా కోసం ఇంటింటి సర్వే నిర్వహించాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో బీఎల్ఓ లకు సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటిని సందర్శించి సర్వే నిర్వహించాలన్నారు. చనిపోయిన వారి పేర్లను ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పుల విషయాన్ని ఓటర్లకు తెలియజేయాలని సూచించారు. అవసరం ఉన్న 6-ఏ,7 పత్రాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ ఎంపీ ఓ అనిల్ ఆర్ఐ అంజన్ కుమార్ పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలోని పలు ప్రయివేటు పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. శనివారం మంచిర్యాల కేంద్రంలోని ఆల్ఫోర్స్, పల్లవి మోడల్ స్కూల్స్‌లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు అంబరాన్ని అంటాయి. శ్రీ కష్ణ జన్మ నవమి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలో చిన్నారులు రాధ కృష్ణ, గోపికల వేషధారణలో అలరించారు. విద్యార్థులు అంత కలిసి ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నస్పూర్ : శ్రీరాంపూర్ ఏరియాలోని ఉజ్వల హైస్కూల్లో ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలు కృష్ణుడు, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణుడు బోధించిన భగవద్గీత మానవ జీవనానికి దిశా నిర్దేశం చేస్తుందన్నారు. అనంతరం ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాసిపేట : మండలంలోని ధర్మారావుపేట ఉన్నత పాఠశాలలో నో బ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా విద్యార్థులు పూవ్వులు, ఆకులతో ఆరు అడుగుల కృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాఠశాలలో సిరి చందన అనే అమ్మాయి గోపిక వేశాదారణ పలువురిని ఆకట్టుకంది. పాఠశాలలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.